క్లుప్తంగా

భక్తులతో కిటకిటలాడిన ముత్యాలమ్మ ఆలయం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో వేంచేసి యున్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తుల తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో కూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఈవో డి.రామకృష్ణంరాజు, ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కేపీ పాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి



బీచ్‌లో సేదతీరుతున్న సందర్శకులు

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలి వచ్చారు. ఉదయం నుంచి ఆకాశంలో చల్లని మబ్బులతో వాతావరణం అహ్లాదకరంగా ఉండటంతో పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం తీరంలోని వేంకటేశ్వరస్వామి, పాండురంగ స్వామి, అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను సందర్శించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఇబ్బందులు



సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

నరసాపురం రూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిరుద్యోగం, విద్యుత్ చార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా ఆదివారం నరసాపురం 24వ వార్డులో సీపీఎం ఆధ్వర్యాన సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కమిటీ సభ్యుడు పాగాకు నారాయణరావు మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతోందన్నారు. కార్యక్రమంలో అప్పల నాయుడు, టంకాని నారాయణరావు, గంగులూరి వెంకట్రావు పాల్గొన్నారు.

పెద మామిడిపల్లిలో మదర్ థెరిస్సా జయంతి



మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పెద మామిడిపల్లిలో మదర్ థెరిస్సా జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పేములమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మదర్ థెరిస్సా విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 50 మంది మహిళలకు చీరలు, వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. చిరు మదర్ సేవా సమితి అధ్యక్షుడు చేబ్రోలు కృష్ణమోహన్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో తులా రామలింగేశ్వరరావు, శిడగం సురేంద్ర, కడలి స్వామి వెంకటాద్రి, బొక్కా సీతారామయ్య పాల్గొన్నారు.

వేద విద్యార్థులకు పట్టాల పంపిణీ



అయిభీమవరం వేద పాఠశాలలో పట్టాలు పొందిన విద్యార్థులు

ఆకివీడు: వేద విద్యార్థులు ఉన్నతమైన చదువులు చదివి సమాజానికి విలువైన సేవలందించాలని మాజీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు పిలుపునిచ్చారు. మండలంలోని అయిభీమవరం గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరా వేద పాఠశాల నాలుగో స్నాతకోత్సవ సభ ఆదివారం జరిగింది. సభకు ప్రిన్సిపాల్ కేవీఎస్ కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా బాపిరాజు హాజరయ్యారు. శుక్ల యజుర్వేదం పూర్తి చేసిన నలుగురు విద్యార్థులు, కృష్ణ యజుర్వేదం పూర్తి చేసిన విద్యార్థి, అథర్వణ వేదం పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థులకు పట్టాలు అందజేశారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



ప్రసాదరాజును సన్మానిస్తున్న గ్రామస్తులు

నరసాపురం రూరల్: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. ఆదివారం ఆయన నరసాపురం మండలం వైఎస్ పాలెం పంచాయతీ పరిధిలోని చామకూరివారి మెరకలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో నరసాపురం నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వైఎస్ పాలెం పంచాయతీ పరిధిలో ఒక హైస్కూల్, ఐదు ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని, ఈ ఏడాదితో మొత్తం పాఠశాలలను నాడు–నేడు ద్వారా అభివృద్ధి చేసుకుంటామని ఆయన చెప్పారు. సుమారు రూ.1.70 కోట్లు నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధికి గ్రామంలో ఖర్చు చేశామన్నారు. ఈ నాలుగేళ్లలో సుమారు రూ.10 కోట్లు గ్రామాభివృద్ధికి ఖర్చు చేయగా, 1,200 కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో సుమారు రూ.26 కోట్లు పలు సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు తెలిపారు. గ్రామంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలాన్ని కొనుగోలు చేసేందుకు దాతలు, సంఘ పెద్దలు ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమన్నారు. చవ్వాకులవారి మెరక ప్రాథమిక పాఠశాల పనులు కూడా వెంటనే ప్రారంభించి నిర్ణీత సమయానికి పూర్తి చేస్తున్నామని ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, కడలి రాంబాబు, దొంగా మురళీకృష్ణ, మైలాబత్తుల శ్రీను, కిరణ్, చవ్వాకుల నాగేశ్వరరావు, పాముల లక్ష్మీకాంతం, గుబ్బల వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలమూరులో ఉచిత శాంతి రథం ప్రారంభం

పెనుమంట్ర: మండలంలోని ఆలమూరు గ్రామంలో సోమవారం నుంచి ఉచిత శాంతి రథాన్ని ప్రారంభిస్తున్నట్లు గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవకుడు సత్తి చిరంజీవి రెడ్డి ఆదివారం తెలిపారు. తన తండ్రి సత్తి సత్యనారాయణరెడ్డి స్మారకార్థం ఉచిత శాంతి వాహనాన్ని ఏర్పాటు చేశామని, కుల, మతాలకు అతీతంగా సిద్ధాంతం గోదావరి తీరం వరకు ఉచితంగా శాంతి రథాన్ని ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, శాంతి రథం అవసరమైన వారు సెల్ నంబర్లు : 99080 91876, 70320 91876లకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ శాంతి రథాన్ని తన తల్లి సుగుణ చేతుల మీదుగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు.

వైఎస్సార్ సీపీ విజయానికి పనిచేద్దాం

పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)



మాట్లాడుతున్న గుడాల గోపి

యలమంచిలి: పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి పార్టీ కార్యకర్తలంతా సంఘటితంగా పనిచేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. శ్రావణ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా కొంతేరు గ్రామంలోని శ్రీ కుంతీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం దేవేరులకు జరిగిన అభిషేకం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గోపికి ఆలయ అర్చకుడు పూలపల్లి వేణునాథ్, దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ మల్లుల రవికుమార్‌లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గ్రామస్తులతో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. గ్రామంలో చిన్నచిన్న సమస్యలున్నా అందరూ కూర్చుని శాంతియుతంగా చర్చించుకుని సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రజలకు, పార్టీకి మంచి జరిగేలా కార్యకర్తలు కృషిచేయాలని గోపి కోరారు. ఆయనవెంట పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ జక్కంశెట్టి భాగ్యలక్ష్మి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ జక్కంశెట్టి సుభాష్ చంద్రబోస్, గౌరవాధ్యక్షుడు పోలుకొండ ఏలియా భక్తసింగ్, ఉపాధ్యక్షుడు కొయ్యే నాగేశ్వరరావు, గ్రామ జేసీఎస్ కార్యదర్శి పోలుకొండ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పిట్టా రాజేష్, ఉప ప్రధాన కార్యదర్శి తెన్నేటి అలగ్జాండర్, సచివాలయ కన్వీనర్లు నిమ్మకాయల హిమబిందు, జోగి రాజేష్, మండల ఎస్సీ సెల్ సభ్యుడు లంక చిరంజివి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నరసాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సోమవారం ఉదయం 9.30 గంటలకు రుస్తుంబాద్ గ్రామంలోని సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ వద్ద రూ.2.06 కోట్లతో నిర్మించనున్న రాపిడ్ శాండ్ ఫిల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఆయన క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి



మాట్లాడుతున్న ప్రవచన కర్త సత్యంజి

పెనుగొండ: హిందూ ధర్మం ప్రపంచ శాంతిని కోరుకుంటుందని, మానవ మనుగడకు ఆధారమైన పంచాభూతాలను దైవంగా హిందూ ధర్మంలో భావిస్తారని ప్రముఖ ప్రవచన కర్త గమ్మళ్ల సత్యంజి అన్నారు. ఆదివారం సిద్ధాంతంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ ధర్మం, పరిరక్షణ, సాంప్రదాయాలపై ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షకులుగా బాధ్యత తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో చింతకాయల రఘురాం, రేలంగి కుమార్, శంకర్ గౌడ్, శివ రామకృష్ణ, కృష్ణమూర్తి, సిద్ధాంతం హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

చురుగ్గా డ్రెయినేజీ నిర్మాణ పనులు



ములపర్రు పితానివారి పాలెంలో డ్రెయినేజీని నిర్మిస్తున్న దృశ్యం

పెనుగొండ: ములపర్రు శివారు పితానివారి పాలెంలో డ్రెయినేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 15 ఏళ్లుగా డ్రెయినేజీ నిర్మాణం కోసం గ్రామస్తులు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగారు. అయినా మురుగు సమస్యకు పరిష్కారం లభించలేదు. ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మురుగు, డ్రెయినేజీ సమస్యలను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారానికి ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పితానివారి పాలెంలో రూ.18 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. దీనితో పాటు సీతారాముని చెరువులో సైతం డ్రెయినేజీ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. త్వరలో డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేసిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద)లకు ఆయా ప్రాంతాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

కాలిబాట వంతెన పనులు పూర్తి



నరసాపురం బస్టాండ్ వద్ద నిర్మించిన కాలిబాట వంతెన

నరసాపురం: పట్టణంలోని కాటన్ పార్కును ఇటీవల అభివృద్ధి చేశారు. రూ.48.26 లక్షలు 14వ ఆర్థిక సంఘం నిధులతో పార్కును సుందరంగా తీర్చిదిద్దారు. ఇప్పుడు పార్కుకు వచ్చే సందర్శకుల సంఖ్య మరింత పెంచడానికి బస్టాండ్ ఎదురుగా, 216 జాతీయ రహదారి పక్కన ఉన్న పంట కాలువపై రూ.19.50 లక్షలతో కాలిబాట వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు. కాటన్ పార్కు పక్కనే నరసాపురం గ్రేడ్–1 శాఖా గ్రంథాలయ భవనాన్ని మూడు అంతస్తుల్లో నిర్మిస్తున్నారు. ఇటు పార్కుకు అటు లైబ్రరీకి బస్టాండ్ రోడ్డు నుంచి జనం చేరుకోవడానికి ఈ వంతెన ఉపయోగకరంగా ఉంటుంది. వేసవిలో కాలువలు కట్టేసిన తరువాత ప్రారంభమైన ఈ వంతెన పనులను వేగంగా పూర్తి చేశారు. చివరి దశలో టైల్స్ అతికించే పనులు సాగుతున్నాయి. ఇప్పుడు బస్టాండ్, మెయిన్ రోడ్డు నుంచి కాటన్ పార్కుకు నేరుగా చేరుకునే వీలుంది. దీంతో కాటన్ పార్కుకు వచ్చే సందర్శకుల సంఖ్య కూడా భారీగా పెరుగుతుంది. పనులు పూర్తికావడంతో కాలిబాట వంతెన నుంచి పార్కుకు, గ్రంథాలయానికి కూడా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన అవసరం లేకుండా చేరుకోవచ్చు. ఇప్పటికే జనం వంతెనపై రాకపోకలు సాగిస్తున్నారు.

ఓట్లు సరిచూసుకోవాలి



యలమంచిలిలో ఓటర్ల జాబితాను తనిఖీ చేస్తున్న డీసీఓ ఎం.రవికుమార్

యలమంచిలి: ఓట్ల సర్వే పూర్తయిన నేపథ్యంలో ప్రతి సచివాలయం వద్ద ఓటర్ల జాబితా ఉంచామని, ప్రతి ఒక్కరూ ఆ జాబితాలో తమ పేరు ఉందో లేదో నిర్ధారించుకోవాలని పాలకొల్లు అసెంబ్లీ ఎలక్షన్ క్లెయిమ్స్ వెరిఫికేషన్ ఆఫీసర్, డీసీఓ ఎం.రవికుమార్ కోరారు. ఓట్లు ఫీల్డ్ వెరిఫికేషన్‌లో భాగంగా ఆదివారం ఆయన యలమంచిలిలో పర్యటించారు. ర్యాపిడ్‌గా ఇళ్లకు వెళ్లి ఓటర్ల జాబితా తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటుకు నమోదు చేసుకోవడంతో పాటు తుది జాబితాలో తమ పేరు ఉందో లేదో సరిచూసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట తహసీల్దార్ మాతా సునీల్ కుమార్, గ్రామ కార్యదర్శి పాలా శారదా శ్రీనివాస్, వీఆర్వో గోటేటి లక్ష్మీ నరసింహారావు (బుజ్జి) తదితరులు ఉన్నారు.

ధ్యానంతో పాటు మౌనాన్నీ అభ్యసించాలి



మాట్లాడుతున్న ఆవంశ నాగేశ్వరరావు

పెనుమంట్ర: ప్రతి ఒక్కరూ ధ్యానంతో పాటు మౌనాన్నీ అభ్యసించడం ద్వారా శారీరక రుగ్మతల నుంచి బయట పడటమే కాక మనస్సుకు ప్రశాంతత చేకూరుతుందని హైదరాబాద్‌కు చెందిన గ్రేట్ పిరమిడ్ మాస్టర్, ఇక్రిశాట్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త ఆవంశ నాగేశ్వరరావు అన్నారు. పెనుమంట్ర వైఎస్సార్ సీపీ నాయకుడు, గ్రామ ఉప సర్పంచ్ భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు నివాసంలో ఏర్పాటు చేసిన ధ్యాన పిరమిడ్ కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మౌన ధ్యానం సాధన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్సు అంటే తెలియని విషయాలను తెలియజెప్పేదని, వినయం నుంచి జ్ఞానం, శక్తి వస్తుందని, మనల్ని మనం తెలుసుకోవాలంటే మన లోపలికి మనమే ప్రవేశించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పీఎస్ఎస్ఎం అధ్యక్షుడు రుద్రరాజు పెద్దివర్మ, జిల్లా ప్రచార కార్యదర్శి మేకా వెంకటేశ్వరరావు, వడ్డి దుర్గాప్రసాద్, సీనియర్ పిరమిడ్ మాస్టర్ తణుకుకు చెందిన కేవీఎస్ వాసు, వట్టికూటి సుబ్బారావు, వీరవాసరానికి చెందిన కేవీడీ ప్రసాద్‌తో పాటు పలువురు పిరమిడ్ ధ్యాన కేంద్ర సభ్యులు, సాధకులు పాల్గొన్నారు.

లక్ష్మీ వేంకటేశ్వర స్వామివార్లకు విశేషాలంకరణ

పాలకొల్లు అర్బన్: ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని వాలమర్రులో వేంచేసి యున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివార్లకు ఆదివారం విశేషాలంకరణ చేశారు. అభిషేకాలు, అష్టదళ పాద పద్మారాధన పూజలు నిర్వహించారు. అర్చక స్వామి పెద్దింటి మణికిరణ్ బ్రహ్మత్వంలో భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వాసవి మాతకు సారె సమర్పణ

పెనుగొండ: శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం పెనుగొండ శ్రీ నగరేశ్వర మహిషాసుర మర్ధని వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఉయ్యూరు మండలం కల్వ పాముల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన వాసవి మాత, మహిషాసురమర్ధని అమ్మవార్లకు సారె సమర్పించారు. ఉదయం నుంచి నగరేశ్వర స్వామికి పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులతో పాటు ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట్ల మోహనరావు పాల్గొన్నారు.

శేషబాబును కలిసిన జిన్నూరు వైఎస్సార్ సీపీ నాయకులు



శేషబాబును అభినందిస్తున్న జిన్నూరు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు

పోడూరు: టీటీడీ పాలక మండలి సభ్యునిగా నియమితులైన మేకా శేషబాబును ఆదివారం ఆయన కార్యాలయంలో జిన్నూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. గ్రామ సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ జమ్ము మృత్యుంజయరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు భూపతిరాజు సూర్వరాజు తదితరులు శేషబాబును సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. శేషబాబు రాబోయే కాలంలో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మీసాల దాన వెంకట నర్సింహులు, కడలి సూర్యచంద్రరావు, రెడ్డి అంజిబాబు, చాణక్యశెట్టి చినబాబు, జక్కంశెట్టి అప్పాజీ తదితరులు శేషబాబును కలిసిన వారిలో ఉన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధికి సీఎం కృషి



మొగల్తూరులో విలేకరులతో మాట్లాడుతున్న గూడూరి వెంకటేశ్వరరావు

మొగల్తూరు: బలహీన వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని బీసీ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మొగల్తూరు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీలకు నామినేటెడ్ పదవుల కేటాయింపులో మరింత ప్రాధాన్యత కల్పించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను బీసీలకు ఎక్కువగా కేటాయించాలని కోరారు. పేద విద్యార్థులు, నిరుద్యోగులకు ఉద్యోగాలకు సంబంధించి పరీక్ష ఫీజులో నూరు శాతం మినహాయింపునివ్వాలన్నారు. సమావేశంలో కుక్కల సత్యనారాయణ, కండిబోయిన సుబ్రమణ్యం, కెల్లా పెద్దిరాజు, గుబ్బల నాగేశ్వరరావు, కాండ్రేకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కకు దశ దిన కర్మ



పెంపుడు కుక్కకు కర్మకాండలు నిర్వహిస్తున్న మాజీ ఎంపీ చేగొండి హరరామజోగయ్య

పాలకొల్లు అర్బన్: మాజీ ఎంపీ చేగొండి హరరామజోగయ్య ఇంట్లో పెంచుకుంటున్న పెంపుడుకుక్క చనిపోవడంతో ఆదివారం దశ దిన కర్మ నిర్వహించారు. ఇంట్లో స్నేహంగా మెలుగుతూ ఎంతో విశ్వాసంగా ఉండేదని జోగయ్య అన్నారు. కుక్కకు ఆత్మశాంతి కలగాలని బ్రాహ్మణులతో శాస్త్రోక్తంగా పూజలు చేసి పొత్తర్లు సమర్పించినట్లు చెప్పారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ



యాళ్లవాని గరువులో భూమిపూజ చేస్తున్న గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ కార్యాలయ భవన నిర్మాణానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆదివారం తెల్లవారు జామున యాళ్లవాని గరువు (దొడ్డిపట్ల రోడ్డు)లో భూమిపూజ చేశారు. తన సొంత స్థలంలో కార్యాలయ భవన నిర్మాణానికి ముందుకు వచ్చిన గోపిని పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకంగా అభినందించారు.

నేడు ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్ బీబీ

ఆకివీడు: ఆకివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ కొత్త పాలకవర్గ ప్రమాణస్వీకారం ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్కే రసూల్ బీబీ చెప్పారు. ఆకివీడులోని తన నివాసంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తనకు ఏఎంసీ చెర్మన్ పదవి కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా తన నివాసం నుంచి మోటారు సైకిల్ ర్యాలీతో ఏఎంసీ కార్యాలయానికి చేరుకుంటామని చెప్పారు. ప్రమాణస్వీకారోత్సవానికి వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంస్థల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు హాజరుకావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ హుస్సేన్, ఏఎంసీ డైరెక్టర్లు శిరపు శ్రీనివాస్, గంటా ఆనందరావు, మంతెన లక్ష్మీ సూర్యకుమారి, పడమట సుబ్బయ్య, నిమ్మల వెంకటరత్నం, బొండాడ జేష్ మేరీ, ఊడిగ లక్ష్మీ, మెంటే మరియమ్మ, బొక్కా శ్రీనివాస్, శలా సుబ్బలక్ష్మీ, జెట్ల దివ్య, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని నరసాపురం రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మొగల్తూరు మండలం కేపీ పాలెం గ్రామానికి చెందిన కె.పెద్దిరాజు వద్దిపర్రులో ఉన్న తమ అత్తవారింటికి మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా నరసాపురం రోడ్డులో అయ్యప్పస్వామి ఆలయం వద్ద టాటాఏస్ వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతనిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టాటా ఏస్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఎస్సై బి.మోహన్‌రావు తన సిబ్బందితో కొవ్వాడ అన్నవరం గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.2,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడికి తీవ్ర గాయాలు

పాలకోడేరు: పాలకోడేరు పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన యువకుడు గండికోట దేవరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రక్కును వెనుక భాగంలో ద్విచక్రవాహనంతో బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. తలకు తీవ్ర గాయామై రక్తస్రావం జరగడంతో స్థానికులు 108 వాహనంలో భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.